ప్రజాశక్తి
శనివారం 22 జూలై 2023



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

'నేతన్న నేస్తం'తో రూ.3.51 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నేతన్న నేస్తం పథకం ద్వారా సొంత మగ్గం కలిగిన అర్హులైన చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24వేల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందజేస్తోందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జిల్లాలో నేతన్న నేస్తం ఐదో విడతలో 2023- 24 ఆర్థిక సంవత్సరానికి 1,460 మందికి రూ.3.51 కోట్లను వారి ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన నేతన్న నేస్తం కార్యక్రమంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. చేనేత జౌళి శాఖ ఎడి ఐ.ధర్మారావు మాట్లాడుతూ జిల్లాలో 50 ఏళ్లు దాటిన 3,812 చేనేత కార్మికులకు నెలకు రూ.2,750 చొప్పున చేనేత పింఛను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ప్రతినిధి మంచు చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేఖర్, శ్రీను, ఎడిఒ రమేష్, క్లస్టర్ సిబ్బంది, చేనేత సహకార సంఘాల సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అడుగడుగునా అండగా...

- కనీస వేతనాలకు నోచని అంగన్‌వాడీలు
- గ్రామాల్లో రాజకీయ వేధింపులు
- అంగన్‌వాడీ సమస్యలపై యూనియన్ అలుపెరగని పోరు
- నేడు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు

అసలే అరకొర వేతనాలు... ఆపై రకరకాల పనులు అప్పగింత... ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత ఊసెత్తని పాలకులు... రిటైర్ అయిన తర్వాత ఉత్త చేతులతోనే సాగనంపుతున్న పాలకులు. ఇవి చాలవన్నట్లు గ్రామాల్లో రాజకీయ వేధింపులు. తమ పార్టీకి చెందిన వ్యక్తులను నియమించుకోవాలనే అత్యుత్సాహంతో పనిచేస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా తొలగింపులు. ఇవీ అంగన్‌వాడీ వర్కర్లకు నిత్యం ఎదురవుతున్న సమస్యలు. వీటిపై అంగన్‌వాడీలను సమీకరించి వారిలో చైతన్యం నింపుతూ పోరాటాల వైపు మలచడంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కీలకపాత్ర పోషిస్తోంది. మూడేళ్లుగా పలురకాల పోరాటాలు సాగించి అనేక విజయాలు సాధించిన యూనియన్, పలాస వేదికగా జిల్లా ఎనిమిదో మహాసభలకు సిద్ధమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

జిల్లాలో 15 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2,759 మెయిన్, 599 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 60,029 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 36,990 మంది ఉన్నారు. వీరితోపాటు 12,229 మంది గర్భిణులు, 13,275 మంది బాలింతలు ఉన్నారు. 2,759 మంది అంగన్‌వాడీ వర్కర్లు, అదే సంఖ్యలో హెల్పర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు 599 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం నెలకు రూ.11,500, హెల్పర్లు, మినీ కేంద్రాల్లో పనిచేస్తున్న వారికి రూ.ఏడు వేలు చెల్లిస్తోంది. 2019లో స్వల్పంగా వేతనాలు పెంచిన తర్వాత నాలుగేళ్లుగా ఒక్క పైసా పెంచలేదు. దీనిపై అంగన్‌వాడీ వర్కర్లు అనేక ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అరకొర వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం, వారితో బండెడు చాకిరీ చేయిస్తోంది. ఎన్నికల విధులకు సంబంధించి బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ)గా వారికే విధులు అప్పగించింది. యాప్‌ల్లో వివరాల నమోదుతో పాటు 25 రకాల రికార్డులను రాయిస్తుండడంతో, ఒత్తిడితో రోగాల బారిన పడుతున్నారు. ఇఎస్ఐ అమలు చేయాలని చాలా ఏళ్లుగా మొర పెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

అలుపెరుగని పోరాటాలు

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై యూనియన్ అలుపెరుగని పోరాటాలు సాగిస్తోంది. తెలంగాణ మాదిరిగా వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు వంటి డిమాండ్లతో ఈనెల 11న కలెక్టరేట్ వద్ద 48 గంటల ధర్నా చేపట్టింది. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం మరుసటి రోజు వారిని నిర్బంధించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వేతనాల పెంపు, ఫేషియల్ యాప్ రద్దు, పర్యవేక్షణ పేరుతో వేధింపులు సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. గతేడాది జూలైలో సంక్షేమ పథకాల అమలు, సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ తదితర సమస్యలపై ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. స్కీమ్‌వర్కర్ల సమస్యలపై గతేడాది మార్చి 28, 29 తేదీల్లో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీలు భాగస్వామ్యమయ్యారు అపరిష్కృత సమస్యలపై గతేడాది ఫిబ్రవరిలో చలో కలెక్టరేట్ చేపట్టారు. బిఎల్‌ఒ విధులు అప్పగించొద్దంటూ 2019 నవంబరులో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు.

పోరాటాలతో అనేక విజయాలు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన పోరాటాలతో అనేక విజయాలు సాధించింది. అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న పాలు పక్కదారి పట్టిన వైనంపై అధికారులు 28 అంగన్‌వాడీ కార్యకర్తలను బాధ్యులను చేయడంపై అనేకరకాల ఆందోళనలు చేసి సస్పెన్షన్లు ఆపింది. అంగన్‌వాడీ వర్కర్లకు వేతనం రూ.10 వేలు వేతనం వస్తుందనే సాకుతో వారి రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నించగా నిలువరించింది. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న డిమాండ్‌తో పలురూపాల్లో ఆందోళనలు చేపట్టిన తర్వాత ప్రభుత్వం అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీలకు అమ్మఒడి, చేయూత వర్తింపజేసింది. గార, శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం రూరల్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులపై పోరాడి వారికి అండగా నిలిచింది.

మహాసభను జయప్రదం చేయాలి

అంగన్‌వాడీల సమస్యలపై మూడేళ్లుగా అనేక పోరాటాలను సాగించాం. ప్రభుత్వపరంగా కొన్నిరకాల ప్రయోజనాలు సాధించుకున్నాం. అంగన్‌వాడీలు దీర్ఘకాలంగా పోరాడుతున్న అనేక సమస్యలు ఉన్నాయి. కనీస వేతనాలు, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హక్కులను సాధించుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు సాగించిన పోరాటాలను మహాసభలో సమీక్షించుకుంటాం. భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటాం. మహాసభకు అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు తరలివచ్చి జయప్రదం చేయాలి.

- డి.సుధ,
జిల్లా అధ్యక్షులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ఆగస్టులో సిఎం జగన్ రాక

ప్రజాశక్తి - పలాస

భూమి పూజ చేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆగస్టు రెండు, మూడు వారాల్లో జిల్లాలో పర్యటించే అవకాశముందని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వెల్లడించారు. పర్యటనలో భాగంగా పలాసలోని 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కాశీబుగ్గ కిడ్నీ పరిశోధనా కేంద్రం వద్ద 16 అడుగుల వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ పరిశోధనా కేంద్రానికి వైఎస్ఆర్ రీజనల్ రీసెర్చ్ సెంటర్‌గా నామకరణం చేయనున్నట్లు తెలిపారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధుల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఇప్పటికే వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించామని, ఈ నెలాఖరులోగా సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ.700 కోట్లతో ఇంటింటికీ శుద్ధజలం అందించేందుకు చేపడుతున్న పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, వైస్ చైర్మన్లు బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీ శంకర్, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్, మందస ఎంపిపి డొక్కరి దానయ్య, దురాశంకర్ పండా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పాతపట్నం : మండలంలోని కొరసవాడలో పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ శుక్రవారం పరిశీలించారు. బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేసి 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా చేర్చాలని ఆదేశించారు. చనిపోయిన, వివాహమై వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారిని తొలగించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు, ఇంటిపేరు, చిరునామలో తప్పులు ఉంటే సరిచేయించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.రవిచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు, ఎన్నికల డిటి శైలజ తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు రాసిన లేఖను చూపిస్తున్న గోవిందరావు

జీడిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర చెల్లించి, ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాసిన లేఖను స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు బాధ్యత తీసుకుంటామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం, జీడిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. జీడికి మద్దతు ధర ప్రకటించకపోవడం వల్ల రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి మద్దతు ధరపై టిడిపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన మంత్రులు, స్పీకర్ జీడి మద్దతు ధరపై ఎందుకు బాధ్యత వహించడం లేదని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజు చేసిన బస్తాకు రూ.తొమ్మిది వేలు ప్రకటన వల్ల జీడి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జీడి పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు.

'బ్రో' అందరినీ అలరిస్తుంది

సినీ నటుడు సాయిధరమ్ తేజ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రేక్షకులందరినీ బ్రో చిత్రం అలరిస్తుందని సినీ హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. శ్రీకాకుళం వచ్చిన ఆయనకు నగర ముఖద్వారం వద్ద మెగా ఫ్యామిలీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడ్నుంచి ఊరేగింపుగా అరసవల్లి చేరుకున్న ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి ఇఒ హరి సూర్యప్రకాష్ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం గార మండలం శ్రీకూర్మంలో శ్రీకూర్మనాథ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్, తాను కలిసి నటించిన బ్రో చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రాబోతోందన్నారు. ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరారు. రోడ్డు ప్రమాదం నుంచి కోలుకున్న తర్వాత అరసవల్లి ఆలయాన్ని సందర్శించాలని అనుకున్నానని, ఇన్నాళ్లకు అవకాశం లభించిందన్నారు. అనంతరం ఒక ఫంక్షన్ హాల్‌లో అభిమానులతో ముచ్చటించారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, వైశ్యరాజు మోహన్, సాయిధరమ్ తేజ్ అభిమాన సంఘ అధ్యక్షులు జోగిపాటి వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాన్ని అందుకుంటున్న సాయిధరమ్ తేజ్

ఆత్మవిశ్వాసమే విజయానికి నాంది

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- సిక్కోలు ఎక్సలెన్స్ అవార్డుల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆత్మవిశ్వాసమే విజయానికి నాంది కాగలదని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పాతబస్టాండ్ వద్ద దానేటి శ్రీధర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సిక్కోలు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్‌తో పాటు నీట్ ఇతర పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను పెంచారని కొనియాడారు. ప్రస్తుతం ప్రభుత్వ బడులు ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ఇదే తరహా కృషి కొనసాగితే రానున్న కాలంలో విద్యలో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ దానేటి శ్రీధర్ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని, మారుమూల పల్లెలకు విస్తరింపజేయాలని ఆకాంక్షించారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ యువత చెడు స్నేహాలు, అలవాట్లతో క్రిమినల్ కేసుల్లో చిక్కుకుంటున్నారని చెప్పారు. మంచి మార్గాలను అన్వేషించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన జయహో కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు బ్రదర్ షఫీ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని, స్ఫూర్తిని కలిగించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, దానేటి శ్రీధర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత దానేటి శ్రీధర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డులను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అవగాహనతోనే నేరాల నియంత్రణ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం, ఎచ్చెర్ల

అవగాహనతోనే నేరాల నియంత్రణ సాధ్యమని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. అవగాహన లేకపోవడం వల్లే మహిళలు, మైనర్లు మోసపోతున్నారని చెప్పారు. ప్రతి మహిళా పోలీస్ గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి నేర నియంత్రణలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి మహిళా పోలీసులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి యువతకు అవగాహన కల్పించి, వారిలో మార్పు తీసుకురావాలని సూచించారు. ఆధార్, బ్యాంకు వివరాలు అపరిచిత వ్యక్తులకు తెలియజేయవద్దన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు 1930 హెల్ప్‌లైన్ నంబరును గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించి, నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిసిఆర్‌బి సిఐ ప్రసాదరావు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్ పరిశీలన

ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్‌ను ఎస్‌పి రాధిక పరిశీలించారు. ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం జిల్లా సాయుధ దళాల పోలీసు సిబ్బంది, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, డి.ప్రసాదరావు, జి.వి ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి

రైతుసంఘాల సమన్వయ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతులు పండించిన అన్ని పంటలకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధమైన కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, రైతు సంఘం జిల్లా నాయకులు బలగ శ్రీరామ్మూర్తి, కౌలురైతు సంఘం నాయకులు పోలాకి ప్రసాదరావు, ఎఐకెకెఎంఎస్ నాయకులు సురేష్ కుమార్, ఎఐకెఎంఎస్ నాయకులు కూర్మారావు మాట్లాడుతూ రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను, విద్యుత్ బిల్లు-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలన్నింటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి ధర నిర్ణయించాలన్నారు. ఏకకాలంలో పంట రుణాలను మాఫీ చేయాలని, 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర నిర్ణయించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. ఈనెల 27న జిల్లాలోని అన్ని రైతు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. అనంతరం ఈనెల 30న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘాల నాయకులు

సాంకేతికతతో రైతులకు లబ్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు మరింత లబ్ధి చేకూరేలా వ్యవసాయ సలహా మండలి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జెసి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయమే కాకుండా వ్యవసాయ అనుబంధ రైతులకు మేలు చేకూరాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ మాట్లాడుతూ 50 ఎకరాలు ఒక క్లస్టర్‌గా తీసుకుని లక్ష ఎకరాల్లో సంపూర్ణ యాంత్రీకరణ కావాలన్నారు. వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్ మాట్లాడుతూ జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకున్నా, ఈనెలలో కురుస్తున్న వర్షాలతో వ్యవసాయానికి అనుకూలంగా ఉందన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు వర్షాభావం లేకుంటే అందుకు తగిన విధంగా పంటలు వేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నవంబర్ 15 వరకు సాగునీరు అందించగలిగితే, అనుకున్న స్థాయిలో దిగుబడి లభిస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, జిల్లా నీటిపారుదల సలహా మండలి సభ్యులు గొండు రఘురాం, రాగోలు వ్యవసాయ పరిశోధనా క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త పి.వి సత్యనారాయణ, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు, నాబార్డు డిడిఎం వరప్రసాదరావు, ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్, ఉద్యానశాఖ అధికారి ఆర్.వి ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్ధకశాఖ జెడిలు పి.వి శ్రీనివాసరావు, ఎం.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 50 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 50 వినతులు వచ్చాయి. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీరాములు, బి.వి.వి.ఎన్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. గ్రేడ్-2 జెవిఎంలను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి ప్రొవిజన్ డిక్లేర్ చేయాలన్నారు. ట్రెజరీల ద్వారా జీతాలు చెల్లించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IP: 7/2022

Between:
కోనా రామక్రిష్ణ -- పిటిషనర్
And:
రావాడ రామారావు మరియు అదర్స్ --రెస్పాండెంట్స్

To,
D-9: Ledhala Raghu S/o Chittayya, Hindu, R/o D.No: 4-6-39, Pedda Relli Veedhi, Srikakulam. cell: 7013472967.
D-10: Ledhala Geetha D/o Chittayya, Hindu, R/o D.No: 4-6-39, Pedda Relli Veedhi, Srikakulam. cell: 7013472967.

ఇందలి పిటీషనర్ శ్రీ కోర్టు వారి వద్ద తనను ఇన్సాల్వెన్స్ డిక్లేర్ చేయమని కోరుతూ దాఖలు చేసిన దావాలో మీ యెక్క ఆక్షేపణలు దాఖలు చేయుటకు **తే.29-8-2023దిన ఉదయం 10-30గం॥లకు** మీరు గాని మీ తరపు లాయరు ద్వారా గాని దాఖలు చేయవలెను. అట్లు కానిచో ఉన్న ఆదారాలతో మీ పరోక్షమున తీర్మానం చేయడమగునుని ఇందు ఎమూలంగా తెలియజేయడమైనది.

KOMARA NIRANJANA RAO
ADVOCATE, VZM,
Cell: 9652282606.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ కోర్టులో
EP 36/2019 in O.S 45/2000

Between:-
గురుగుబెల్లి మోహనకృష్ణ --పిటీషనరు(DHR)
And:
గురుగుబెల్లి సూర్యనారాయణ (డైడ్) వగైరాలు --రెస్పాడెంటు(JDRS)

To,
4. గురుగుబెల్లి చిరంజీవి S/o లేటు జగన్నాథం.
5. పైడి ధనలక్ష్మి W/o శ్రీనివాసులు జన ఇద్దరు సా॥ ఫరీదుపేట గ్రామం&పోస్టు, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా.

ఈ నెం DHR Final Decree Schedule దాఖలలో Commission Plan లో చూపించిన ఆకుపచ్చ రంగులో గల 'A' ఆస్తులు అప్పగించమని కోరుతూ పైనెంబరు అమలు దాఖలు చేసి నందున ఇందు విషయమై మీకుగల ఆక్షేపనలు **తే॥ 09-08-2023 దీన ఉ॥ 10.30 గం॥లకు** స్వయంగా కాని లాయర్ ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలియపరుచు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు Ex-parte తీర్మాణం జరుగునని ఇందు మూలంగా తెలుసుకొనవలెను.

డి.సరళకుమారి
పిటీషనర్ తరపు న్యాయవాది,
శ్రీకాకుళం,
ఫోన్: 8247600229.

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిని నియామకం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరీష్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సంతోష్‌లు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కళాశాల విద్యార్థులతో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో ఏడు జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందజేయాలన్నారు. మధ్యాన్నం భోజన పథకం అమలు చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమన్నారు. పాఠ్య పుస్తకాలు లేకపోతే విద్యార్థులు ఏ విధంగా రాణిస్తారని ప్రశ్నించారు. కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు యోహాన్, తరుణ్, దేవేంద్ర, శివ, మహేష్, సాయి, గణేష్, చెందు, కృష్ణ, సంతు, విష్ణు, నీరజన, శిరీష, మాధురి పాల్గొన్నారు.

నేడు కోటిపల్లిలో స్పీకర్ పర్యటన

పొందూరు : మండలంలోని కోటిపల్లి పంచాయతీ శనివారం నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొంటారని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

మాట్లాడుతున్న జ్ఞానసువర్ణరాజు

న్యాయం దృష్టిలో అందరూ సమానమే

శాశ్వత లోక్ అదాలత్ జడ్జి జ్ఞానసువర్ణరాజు

శ్రీకాకుళం అర్బన్ : రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకొని సమాజంలో ఉత్తమ పౌరులుగా నిలవాలని శాశ్వత లోక్ అదాలత్ జిల్లా న్యాయమూర్తి జి. జ్ఞానసువర్ణ రాజు సూచించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా ప్రయోజన సేవా కార్యక్రమం పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రయోజన సేవలో ఎటువంటి సందేహాలు ఉన్నా శాశ్వత లోక్ అదాలత్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. పోస్టల్, విమాన సర్వీసులు, టెలిగ్రాఫ్, టెలిఫోన్ సర్వీసులు, విద్య, విద్యా సంస్థలు, బ్యాంకింగ్ సేవలు, ఉపాధి హామీ, హౌసింగ్, రియల్ ఎస్టేట్, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలన్నీ ప్రజా ప్రయోజన సేవల్లోకి వస్తాయన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో కేసు వేయాలంటే ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సర్వీసెస్‌లో ఎటువంటి లోపం ఉన్నా ఈ కోర్టులో ఉచితంగా కేసు వేసుకుని రూ.కోటి వరకు నష్టపరిహారాన్ని పొందవచ్చునని అన్నారు. సమావేశంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శంకర నారాయణ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- జలుమూరు

ఇటీవల నిర్వహించిన బదిలీల్లో వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంత్ అప్‌డేట్ కాలేదన్న నెపంతో జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతిరావు కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లాడ, రామకృష్ణాపురం, తిమడాం, అచ్యుతాపురం, శ్రీముఖలింగం, యలమంచిలి, చల్లవానిపేట తదితర ఉన్నత పాఠశాలలను యుటిఎఫ్ బృందం శుక్రవారం పర్యటించింది. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా తీసుకునే నిర్ణయాల వల్ల అటు విద్యారంగానికి, ఇటు ఉపాధ్యాయులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో నూతన విధానాలు ప్రవేశపెడుతున్నట్లు చెబుతున్న ప్రభుత్వం, అందుకు తగినట్లు ఉపాధ్యాయ నియామకాలు

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

గాని, కొత్త పాఠశాలల ఏర్పాట్లు గాని చేయకుండా జిఒ నంబరు 117ను అడ్డుపెట్టి ఉన్న పాఠశాలలను ఉపాధ్యాయ పోస్టులను కుదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనల పేరుతో ఉపాధ్యాయులను భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. జగనన్న విద్యా కానుకలో ఇప్పటికీ కొన్ని టైటిల్స్ లేకపోవడం, పిల్లలకు సరిపడే బూట్ల సైజులు లేకపోవడంలాంటి లోటుపాట్లు ఉన్నాయని అన్నారు. అవి సరిచేయకుండా పిల్లలు వేసుకోలేదనే నేపంతో ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరైన పద్ధతి కాదన్నారు. దీన్ని మార్చుకోకపోతే భవిష్యత్‌లో ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. సిపిఎస్ రద్దు చేయమని నాలుగేళ్లుగా పోరాటాలు చేస్తుంటే... ప్రభుత్వం మాత్రం సిపిఎస్‌ను రద్దుచేసి జిపిఎస్ అనే వింత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి సిద్ధం కావడానికి పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరణే యుటిఎఫ్ లక్ష్యంగా భవిష్యత్‌లో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, జిల్లా నాయకులు డి.రాము, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.హర్షవర్ధన్, ఎం.పురుషోత్తం, మండల కోశాధికారి ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న తేజేశ్వరరావు

పోరాటాలు ఉధృతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకుంటే దశలవారీ పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షులు అరుగుల గణేష్ హెచ్చరించారు. మున్సిపాలిటీలోని ఆప్కాస్ కార్మికులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్ష శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఈ దీక్షను తేజేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. క్లాప్ డ్రైవర్లకు నెలానెలా జీతాలు చెల్లించాలన్నారు. దశల వారీ ఆందోళనలో భాగంగా ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 7న కలెక్టరేట్లు ముట్టడిస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరంలో కె.లలిత, ఎం.లక్ష్మి, పి.మలమ్మ, డి.దేవి, టి.వెంకటలక్ష్మి, జి.ధనలక్ష్మి, ఐ.రాజ్యలక్ష్మి, రాము, డి.చిట్టిబాబు, కళ్యాణం, రాజు, మోహన్, జనార్ధన్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికులు చేపట్టిన దీక్ష, ధర్నా కొనసాగింది. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.మురగన్, రమేష్, శంకర్, భాస్కరరావు,

పలాస : ఆందోళన చేస్తున్న కార్మికులు

రాము, సీతమ్మ, ఉష పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. ఆప్కోస్‌లో ఉన్న వారందరినీ రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు.

ఆమదాలవలస : మున్సిపల్ కార్యాలయం వద్ద చేపడుతున్న పారిశుధ్య కార్మికుల రిలే దీక్షలకు సిఐటియు మండల నాయకులు పంచాది లతాదేవి, అంగన్వాడీ సెక్టార్ యూనియన్ అధ్యక్షులు పి.భూలక్ష్మి, పారిశుధ్య కార్మిక నాయకులు టి.సంతోష్, జె.వాసు, శ్రీను, నీలయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక పురపాలక సంఘానికి విడుదలైన మొదటి విడత 15 ఆర్థిక సంఘం నిధులు రూ.1.20 కోట్లు కేటాయింపుపై కౌన్సిలర్లు సమీక్షించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందుగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మొదటి విడతగా మంజూరైన నిధులతో టైడ్ గ్రాంట్ రూ.72,58,134 కాగా, అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.48,38,758 మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో టైడ్ గ్రాంట్ నుంచి పట్టణంలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తే మంచిదని ఒకటో వార్డు కౌన్సిలర్ ప్రేమకుమార్ సూచించారు. ఈ నిధులు కేవలం నీటి సరఫరా, శానిటేషన్ కోసం వెచించాలని నిబంధన ఉందని కమిషనర్ రమేష్

మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

తెలిపారు. మున్సిపాలిటీలో సమగ్ర నీటి పథకం పనులు ఉండడం వల్ల మార్పు చేసి ఉన్నత అధికారుల ఆమోదం కోసం పంపిస్తే ప్రయోజనం ఉంటుందని సూచించారు. టిడిపి కౌన్సెల్ సభ్యులు ఆసీ లీలారాణి, పత్రి తవిటియ్య మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి వార్డులోనూ సమస్యలు పరిష్కరించేందుకు నిధులు ఖర్చు చేయాలన్నారు. టిడిపి కౌన్సెల్ సభ్యులు కాళ్ల దిలీప్ మాట్లాడుతూ సెంటర్ లైటింగ్ అవసరమైన ప్రతిసారీ ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయని అన్నారు. నిధులు కేటాయించిన వెంటనే పనులు చేపట్టాలని అన్నారు. దీంతో వచ్చిన నిధులు అన్ని వార్డుల్లో చిన్న చిన్న రోడ్లు, కాలువల నిర్మాణాలకు వినియోగించాలని వార్డు కౌన్సిలర్లు బచ్చు జగన్, చిదిపోతి జగన్, ప్రదీప్‌లు సూచించారు. వైస్ చైరపర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలు ఉండగా... సెంటర్ లైటింగ్‌కు ఖర్చు చేస్తే విమర్శలు వస్తాయని, ఈ నిధులు వినియోగంపై పలువురు పలు రకాలు సూచనలు చేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో కమిషనర్ ఆధ్వర్యాన ఇంజినీరింగ్ అధికారులు పర్యటించి అక్కడ నెలకొన్న ప్రధాన సమస్యలు పరిశీలించి నిధులు కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న భార్య

భర్త చితికి భార్య నిప్పు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పుట్టెడు శోకములోనూ భర్త చితికి భార్య నిప్పంటించింది. శుక్రవారం పూండి శ్మశాన వాటికలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గేదెల ధర్మారావు (55) కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండేవాడు. చికిత్స పొందుతూ విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి కుమారుడు ప్రశాంత్ ఉన్నాడు. పూండి ప్రాంతంలో మొట్టమొదట టైప్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించి ఎంతో మందికి శిక్షణ ఇచ్చి టైప్ మాస్టర్‌గా పేరుపొందారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఆయన మరణ వార్త విన్న స్థానికులు, విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు, టిడిపి నాయుకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పున్నానపాలెం సమీపంలో వ్యవసాయ పంపుసెట్టు కోసం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం నేలకొరిగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఏ విధమైన ప్రమాదాలు జరగలేదు. రోడ్డు పక్కనే నూతనంగా వేసిన ట్రాన్స్‌ఫార్మర్ హఠాత్తుగా నేలకొరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలకు ఏ విధమైన కాంక్రీట్ వేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే నేలకొరిగింది. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ లైన్‌మేన్ లైను కట్ చేశారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

నాగభూషణంకు నివాళి

కొత్తూరు : స్థానిక పిఎసిఎస్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శాంతి భర్త నాగభూషణం మూడో వర్ధంతిని వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. ముందుగా నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అభివృద్ధికి నాగభూషణం కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గండివలస ఆనందరావు, గార రాజులునాయుడు, బర్రి శ్రీను, వంబరవల్లి సూర్యనారాయణ, పంకాజ్‌దాస్, దూళి అప్పన్న పాల్గొన్నారు.

కీర్తికి డాక్టరేట్ అందజేత

ఎచ్చెర్ల : ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ విభాగంలో పనిచేస్తున్న లెక్చరర్ మలిపెద్ది కీర్తి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. ఈ పట్టాను ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ప్రదానం చేశారు. కీర్తి ఫార్మసీ డిపార్ట్‌మెంట్, ఆంధ్రా యూనివర్సిటీలో 'ఫార్మాకోగ్నోస్టిక్ స్టడీస్ ఆఫ్ బుకానానియా లాంజాన్ స్ప్రెంగ్, బాకోపా మొన్నీరి (ఎల్) వెటిస్ట్, ఎలెట్టేరియా కార్డమోమం (ఎల్) మాటన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎ పాలిహెర్బల్ ఫార్ములేషన్ అగైనిస్ట్ డెంగీ' అంశంపై పరిశోధన చేశారు. దీనికి గాను డాక్టరేట్‌కు ఎంపికైంది. ఈమెకు కళాశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

పట్టాను అందుకుంటున్న కీర్తి

ఎన్‌సిఇఆర్‌టి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా
జగన్మోహనరావు ఎంపిక

పొందూరు: మండలంలోని మజ్జిలిపేటకు చెందిన గురుగుబెల్లి జగన్మోహనరావు ఢిల్లీలోని ఎన్‌సిఇఆర్‌టిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన ప్రస్తుతం నాగాలాండ్ రాష్ట్రంలోని కోహిమాలో ప్రయివేటు యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తండ్రి గురుగుబెల్లి వేణుగోపాలరావు విశ్రాంత ఎంఇఒ. తల్లి ఆండాలమ్మ గృహిణి, భార్య శ్రావణిలు ఉన్నారు. ఎన్‌సిఇఆర్‌టికి ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జగన్మోహనరావు

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

టెక్కలి రూరల్ : ఒంగోలులో గిరిజన యువకుడిపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టి నోట్లో మూత్రం పోసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ గిరిజనులపై అగ్రవర్ణ తరగతులకు చెందిన వారు దాడులు చేస్తున్నారని అన్నారు. మధ్యప్రదేశ్‌లో ఆదివాసీ యువకుడిపై మూత్రం పోసి దాడి చేసిన ఘటన మరువక ముందే ఆంధ్రాలోనూ ఈ రకమైన దాడులకు పాల్పడటం అనేది సబబు కాదని అన్నారు. దీనిని ఆదివాసీ సేన రాష్ట్ర కమిటీగా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తక్షణమే వారిపై క్రిమినల్, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

'మెట్‌కోర్ ఫెర్రో అల్లాయిాస్' కార్మికుల ధర్నా

టెక్కలి రూరల్: మండలంలోని రావివలసలో మెట్‌కోర్ ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు మే నెల నుంచి బకాయి జీతాలు చెల్లించాలని కార్మికులు కోరారు. ఈ మేరకు టెక్కలి లేబర్ అధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నంబూరి షన్ముఖరావు మాట్లాడుతూ 300 మందికి పైగా పనిచేస్తున్న కార్మికులకు, అధికారులకు ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా పనులు నిలుపుదల చేయడం సరికాదన్నారు. బకాయి పడిన జీతాలను చెల్లించాలని సబ్ కలెక్టర్, లేబర్

ధర్నా చేస్తున్న కార్మికులు

అధికారులు చెప్పినా యాజమాన్యం బకాయి జీతాలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కంపెనీ తెరిపించాలన్నారు. కార్యక్రమంలో పిట్ట గంగయ్య, సీతారాం, పైల గున్నయ్య, గురయ్య పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గం కంచిలిలోని పురాతనమైన శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి ఉదారంగా స్పందించి ఆర్థికంగా సహకరించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలో టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కంచిలిలో పురాతనమైన శ్రీకృష్ణ మందిరం అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. అలాగే జిల్లాలో అత్యధికంగా ఉన్న యాదవల కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. అనంతరం సుబ్బారెడ్డికి దుశ్శాలువ కప్పి రామారావు దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్తు చామంతి, నర్తు శివాజీ పాల్గొన్నారు.

కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో మానవ అక్రమ రవాణాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టెక్కలి ఇన్‌ఛార్జి సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వల్ల బెదిరింపులు, బలవంతం వంటివి అనేకం ఉంటాయని, వాటిపై ఆవగాహన ఉండాలని అన్నారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో మనసు పరిపరివిధాలా ఆలోచనలో ఉంటుందని, వాటిని అరికడుతూ మనసు లక్ష్యం వైపు మళ్లించాలని

మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

అన్నారు. విద్యార్థులు ప్రధానంగా చదువుపై దృష్టిసారించాలన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, వైకుంఠరావు పాణిగ్రాహి, బి.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధనరావు, ఆజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన

ఇళ్ల పట్టాల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందించేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని చాపురం పంచాయతీ పరిధిలో 35 మంది లబ్ధిదారులకు తన క్యాంపు కార్యాలయంలో ఇళ్ల పట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ మేరకు సంబంధిత లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, అల్లు లక్ష్మీనారాయణ, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అల్లు అనిల్‌కుమార్, గుండ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కొత్తూరు: విఆర్ఎలకు కనీస వేతనం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరాహారదీక్షకు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్ఎల మండల అధ్యక్షులు డి.అనిల్, డి.గణపతిరావు, కె.రామారావు, జి.గణపతి, జి.ప్రసాద్, రమేష్, సరస్వతి, చంద్రమ్మ పాల్గొన్నారు.

కవిటి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

కవిటి : ధర్నా చేస్తున్న విఆర్ఎలు

తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన దీక్ష శుక్రవారానికి రెండో రోజుకు కొనసాగింది. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్షుడు జన్ని కృష్ణ, జి.కేశవరావు, జనార్ధనరావు, దుద్ది జగదీష్, జి.గణేష్, జి.మోహినమ్మ, తాతారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : విఆర్ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి పంచాది లతాదేవి డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం కొనసాగుతున్న నిరాహార దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సెక్టార్ అధ్యక్షులు పి.భూలక్ష్మి, విఆర్ల సంఘ ఉపాధ్యక్షులు ఎస్.రామారావు, కార్యదర్శి కె.ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్.రాజులు పాల్గొన్నారు.

నందిగాం : తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షా శిబిరాన్ని టిడిపి బిసిసెల్ రాష్ట్ర నాయకులు ఎం.బాలకృష్ణ సందర్శించారు. దీక్షల్లో విఆర్ఎలు రాములమ్మ, గణపతిరావు, అర్జునుడు, సీతమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : సంఘీభావం తెలుపుతున్న ప్రసాద్

పొందూరు: విఆర్ఎల డిమాండ్ల సాధనకు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరవధిక దీక్ష శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తెండేల త్రినాథరావు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను, సమస్యలను పరిష్కరించకపోతే దీర్ఘకాలిక పోరాటాలు చేసేందుకు తామంతా సిద్ధమని హెచ్చరించారు. విఆర్ఎల సంఘం మండల అధ్యక్షుడు ఈశ్వరరావు, కార్యదర్శి వైకుంఠరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక దీక్షకు టిడిపి మండల నాయకులు తమ మద్దతు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, పెద్దపద్మపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, బసవ భాస్కరరావు పాల్గొన్నారు.

'రాస్టర్'కు పది మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

హైదరాబాద్‌కు చెందిన రాస్టర్ ఇంజినీరింగ్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న పది విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐతమ్ క్యాంపస్లో రాస్టర్ కంపెనీ ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపంచారని అన్నారు. వీరికి వార్షిక వేతనంగా రూ.2.40 లక్షలు చెల్లించేందుకు ఆ కంపెనీ అంగీకరిస్తూ ఉద్యోగ నియామక పత్రాలను పంపించిందని పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో అత్యంత

ఎంపికైన విద్యార్థులు

అధునాతన మార్పులు వస్తున్నాయని, మున్ముందు ఈ రంగంలో అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే వీలుందని అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్ఒడి డాక్టర్ పి.దినకర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్‌లు అభినందించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నగదును అందజేస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గత సంవత్సరం పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. అదే గ్రామానికి చెందిన సనపల లక్ష్మున్నాయుడు 85వ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు రూ.పది వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గేదెల యమునకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.పది వేలు, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.2 వేలు చొప్పున నగదును పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సనపల లక్ష్మున్నాయుడు పాల్గొన్నారు.

సిఎంకు అభినందనలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల కేంద్రంలో కళింగ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించిన సిఎం జగన్‌కు, అందుకు ప్రతిపాదనలు పంపించిన కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌కు కళింగకుల పెద్దలు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలో మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి, కళింగ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కావాలని తిలక్‌కు కోరగా, అయన సిఎంతో మాట్లాడారు. రాష్ట్ర బిసి వెల్ఫేర్ ద్వారా కళింగ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా తిరుపతిరావు

సోంపేట : సోంపేట, కంచిలి మండలాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా వెదుళ్ల తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోంపేట పట్టణంలో శుక్రవారం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు వెదుళ్ల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కోట్ని నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పర్రి కృష్ణారావు, సహ కార్యదర్శిగా పొట్టి శివకుమార్, కోశాధికారులుగా పడాల నరేష్‌కుమార్, త్రినాథ్‌పట్నాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బత్తుల కామేశ్వరరావు, మాదిన ప్రసాద్, పిరియా ధర్మేంద్ర, బల్ల జానకిరావు, కె.చంద్రశేఖర్, రత్నాల శ్రీనివాసరావు, గార రాజేంద్ర, ప్రకాష్, రాంబాబు, సంతోష్ కుమార్, బల్ల మోహన్, మహేష్‌కుమార్, తిరుమలరావు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ సభ్యులు

రణస్థలం : పోస్టర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడపగడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘంలోని ఊసవానిపేట, ముస్లిముల కాలనీ, రావికంటిపేటలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, బొడ్డేపల్లి నారాయణరావు, మామిడి ప్రభాకరరావు, దుంపల శ్యామలరావు, సాధు చిరంజీవి, మామిడి రమేష్‌కుమార్, పొడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రణస్థలం : ప్రజా సంక్షేమమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొవ్వాడ, మత్స్యలేశం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్‌ను అందజేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అవగాహన కల్పిస్తున్న హరిబాబు

పంపిణీకి మొక్కలు సిద్ధం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని రైతులకు ఉచితంగా మొక్కలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, బి.ఎల్.ఎన్.మూర్తిలు తెలిపారు. మండలంలోని పెద్దపేట పంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణాలతోపాటు పల్లే ప్రాంతాలు సైతం వాయు, శబ్ధ కాలుష్యం వంటివి పెరిగిపోయాయని అన్నారు. కాలుష్య నివారణతో పాటు రైతులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు తాము అవసరమైన, లాభదాయకమైన మొక్కలను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. మామిడి, జీడి, సపోటా, నిమ్మ, కమల, జామి, పనస మొక్కలను అందజేస్తామని అన్నారు. మొక్కలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు డి.యేసు, జి.ధనుంజయ్, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.

ఒడిశాకు అక్రమంగా ఇసుక తరలింపు

కొత్తూరు : మండలంలోని మతాల-నివగాం వంతెన సమీపంలోని వంశధార నది తీరంలో ఉన్న ఇసుక ర్యాంపు నుంచి ఒడిశా రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసిపి నాయకుల ప్రమేయంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నారు. ఆంధ్రా నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించకూడదని 2019లో హైకోర్టు తీర్పు నిచ్చిన విషయం తెలిసిందే. జయప్రకాష్ పేవర్ వెంచర్ వే బిల్లు పేరుతో ఒడిశా రాష్ట్రానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు బిల్లులు బయటపడ్డాయి. ఈ విషయంపై ఎస్ఇబి ఎస్ఐకి ఫోన్‌లో వివరణ కోరగా... తనకు ఏమి తెలియదని, ఎడి ఫోన్ నంబరు ఇస్తారు అడగండని సమాధానం ఇచ్చారు.

పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

రైతుబజారుకు స్థల పరిశీలన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో రైతు బజార్ ఏర్పాటుకు సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఏప్రిల్ 19న సిఎం జగన్ పర్యటనలో భాగంగా రైతుబజార్ ఏర్పాటుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలం పరిశీలించామని అన్నారు. ఈయన వెంట మార్కెటింగ్ ఎడి జి.కె.రావు, చైర్‌పర్సన్ ప్రతినిధి పి.సంతోష్, కౌన్సిలర్ ప్రదీప్ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వి.ఆర్.గూడెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష లో పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీపాన హరిహరరావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కింతలిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.33 లక్షలతో వాటర్‌ట్యాంకు, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.75 వేలతో ఏర్పాటు చేతి పంపును ప్రారంభించారు. సింగూరు సూర్యనారాయణ, బొమ్మాళి శేషగిరి, సింగూరు తేజేశ్వరరావు, పైడి రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వ్యయ ప్రయాసల కోర్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా నేరుగా

నందిగాం : మాట్లాడుతున్న తిలక్

పొందూరు : ధ్రువపత్రాలను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

ఇంటి వద్దే లబ్ధిదారులకు ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని 300 ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు మెంటాడ స్వరూప్, అరుణ్ గుప్తా, పట్టణ వైసిపి అధ్యక్షులు సాధు వైకుంఠ రావు, బరాటం సంతోష్ పాల్గొన్నారు.

రణస్థలం : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మరువాడలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ దుర్గారావు, తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపిడిఒ రమణమూర్తి పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని కణితవూరు సర్పంచ్ పేరాడ విమల అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురుమాన బాలకృష్ణారావు, ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్ మళ్ల సీతారాం, ఎంపిడిఒ జి.శివప్రసాద్, డిటి ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పలాస : మండలంలోని పెదంచల సర్పంచ్ వరిశ రామారావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, డిటి లక్ష్మీనారాయణ, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవికుమార్, కార్యదర్శి కింతల రవికుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని కేరాశింగిలో నిర్వహించిన జగనన్న సురక్షలో స్పెషలాఫీసర్ భవానీశంకర్ పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, డిటి శంకరరావు, ఎంఇఒ ఎస్.దేవేందేరరావు, మండల ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలిత సర్పంచ్ పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజా పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి

మండల సమావేశంలో ఎంపిపి గోపి

ప్రజాశక్తి- జలుమూరు

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపిపి వాన గోపి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేస్తే వారి సహాయ, సహకారాలు అందజేస్తారన్నారు. అప్పుడే చేయాల్సిన పనిని సకాలంలో చేయగలమన్నారు. ముందుగా ఆయా శాఖల అధికారులు శాఖల పనితీరుపై సమీక్షించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపిపి, నగరికటకం ఎంపిటిసి బగ్గు రామకృష్ణ అన్నారు. ఆర్‌బికెల ద్వారా 50 శాతం అలాట్మెంట్ మాత్రమే వచ్చిందని, మిగిలిన 50 శాతం డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ చెప్పారు. ఎరువుల ధరలను నియంత్రించాలని రామకృష్ణ సూచించారు. గత రెండు సమావేశాల నుంచి శ్రీముఖలింగం నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు సరుబుజ్జిలి మీదుగా ఆర్‌టిసి బస్సులు నడపాలని కోరుతున్నా... ఆ శాఖ అధికారులు ఇప్పటికీ స్పందించడంలేదని అన్నారు. ఖరీఫ్ సాగునీరు పెంచేందుకు వంశధార అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కొన్నిచోట్ల

మాట్లాడుతున్న ఎంపిపి గోపి

కాలువ గట్లు గండ్లు పడ్డాయని, రైతులే చందాలు వేసుకొని వాటిని పూడ్చారని అన్నారు. అవి బలహీనంగా ఉన్నాయని, వాటిపై వంశధార అధికారులు దృష్టి పెట్టాలని గుగ్గిలి సర్పంచ్ కోరారు. జెఇ కొత్తగా విధుల్లో చేరారని, ఇక నుంచి ఆయన అందుబాటులో ఉంటారని వంశధార డిఇ చెప్పారు. సమావేశంలో వీరితో వైస్ ఎంపిపిలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, మండల వైసిపి కన్వీనర్ కనుసు సీతారాం, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

వజ్రపుకొత్తూరు : సన్మానిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కొండవూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు జె.శంకరరావు అధ్యక్షతన సర్పంచ్ కొల్లి భాస్కరరావు శుక్రవారం సన్మానించారు. ఇప్పటి వరకు పనిచేసిన ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ వేణుగోపాల్. గణిత ఉపాధ్యాయులు ఎల్.సుధీర్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఎల్.వి.చలం, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఎన్.దివాకర్, ఎస్‌టియు బి.పురుషోత్తలు బదిలీపై వెళ్లారు. దీంతో పాఠశాల ఆవరణలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రాదేశిక సభ్యులు సూల చిట్టిబాబు, ఉప సర్పంచ్ ఆనందరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.సింహాచలం పాల్గొన్నారు.

పోలీసులకు...

సోంపేట : పట్టణంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో ఇటీవలలో సోంపేట, కంచిలి, బారువ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సిబ్బందికి సిఐ ఆర్.రవిప్రసాద్ సన్మానించారు. బారువలో ఎస్ఐగా పనిచేసి బదిలీపై వెళ్లి సత్యనారాయణ చేసిన సేవలపై కొనియాడారు.

సన్మానిస్తున్న సంఘు నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో వివిధ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్‌ను ఆయన చాంబరులో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుంపల అప్పన్న, ప్రధాన కార్యదర్శి కె.రామేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటరు సర్వేపై పర్యవేక్షణ

టెక్కలి: ఇంటింటా ఓటర్లు సర్వే ప్రక్రియలో సుశిక్షితులైన టిడిపి, బూత్ లైవల్ కార్యకర్తలు అప్రమత్తమై సర్వేపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులతో, కార్యకర్తతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే సమయంలో బిఎల్‌ఒలతో టిడిపి కార్యకర్తలు ఉండాలన్నారు. వాలంటీర్లు సర్వేలో పాల్గొనకుండా చూడాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు హనుమంతు రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు ఇప్పిలి జగదీష్, బసవల అప్పలస్వామి పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి సేద్యంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా మహిళా సంఘ సభ్యులకు కొరపాం, చేపేనపేట, కొత్తవలస గ్రామాల్లో ప్రస్తుతం సాగు చేయబోయే వరి పంటలో మెరుగైన ప్రకృతి వ్యవసాయ విధానాలపై వివరిస్తూ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటలో తప్పకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తూ... అలాగే పెట్టుబడులను పూర్తిగా తగ్గించుకొని జీవామృతం, కాషాయాలను పంటలపై పిచికారీ చేయడంతో పంట

అవగాహన కల్పిస్తున్న చిరంజీవిరావు

దిగుబడి పెరగడంతో పాటు నాణ్యమైన పంట లభ్యమవుతుందని అన్నారు. అందువల్ల రైతులందరూ పూర్తిగా ప్రకృతి సేద్యంలోనే పంటలను పండిస్తే అధిక దిగుబడులను పొందవచ్చునని తెలిపారు. అనంతరం సంఘ సభ్యులకు వరి పంట గట్లపై వేసుకోవడానికి తీగజాతి, కూరగాయల విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి పాల్గొన్నారు.

పుస్తకాలను అందజేస్తున్న తేజలక్ష్మి

పుస్తకాల పంపిణీ

ఆమదాలవలస : విద్యార్థులు విద్యలో రాణించాలని రోటరీ క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ తేజలక్ష్మి అన్నారు. గార మండలంలోని వమరవెల్లి డైట్ మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యలో బాగా రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ చైతన్య, సూపరింటెండెంట్ కె.మురుడేశ్వరరావు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ, డిప్యూటీ వార్డెన్ ఎస్.పి.అనితరాణి, డైట్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కిల్లి ఈశ్వరరావు, కింతలి బాబూరావు, విద్యా కమిటీ చైర్మన్ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని ముక్తాపురానికి చెందిన కొల్లి యర్రయ్య, బి.పార్వతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, పారిశ్రామికవేత్త మామిడి గోవిందరావు కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. అలాగే నిరుపేదలైన ఎం.కాంతమ్మ, బారికి, గుమ్మడి ఉషలను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆయా కుటుంబాలకు రూ.20 వేలు ఆర్థకసాయం అందజేశారు. భవిష్యత్‌లో ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా నేనున్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, మాజీ ఎంపిటిసి ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామాలను పరిశుభ్రంగ ఉంచడం అందరి బాధ్యతని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ ఆధ్వర్యాన సర్పంచ్‌లకు చెత్త సేకరించే బుట్టలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ బుట్టలను పంపిణీ చేయాలని కోరారు. తడి, పొడి చెత్తల వేర్వేరుగా బుట్టల్లో సేకరించాలన్నారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వంక రాజు, వజ్రపుకొత్తూరు, కొందవూరు సర్పంచ్‌లు గురయ్యానాయుడు, భాస్కరరావు, గొరకళ విశ్వనాథం, విఘ్నేష్, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, కార్యదర్శి యాదవ రాజు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై దృష్టి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి పోతనపల్లి చంద్రశేఖర్, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అధికారులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాంపై అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులు వచ్చిన వెంటనే సత్వరం పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా వ్యవహరించాలని, పరిష్కారం అనంతరం మండల స్థాయి అధికారులు వచ్చి సర్వే చేస్తామని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

శ్రీకాకుళం అర్బన్ : ఎచ్చెర్ల మండలం చిలకపాలెం ఎపిజివి బ్యాంకు ఖాతాదారులు బడితమాని ఆదిలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. ఆమెకు ప్రధానమంత్రి జీవన జ్యోతి సురక్ష బీమా యోజన ద్వారా రూ.4 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు బ్రాంచి మేనేజర్ ఎం.రజని శుక్రవారం అందజేశారు.

చెక్కును అందజేస్తున్న మేనేజర్ రజని